క్లుప్తంగా

ప్రహ్లాద భక్తి విజయం గ్రంథ ఆవిష్కరణ



పెదకాకాని: విశ్వనాథ సాహిత్య అకాడమీ, వాసిరెడ్డి వెంకటాద్రి అంతర్జాతీయ సాంకేతిక విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో కర్ణాటక సంగీత రత్న త్యాగయ్య రచించిన ప్రహ్లాద భక్తి విజయం పుస్తకావిష్కరణ కార్యక్రమం వీవీఐటీ విశ్వవిద్యాలయంలో ఘనంగా జరిగింది. మండలంలోని నంబూరు వీవీఐటీయూలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా చాన్స్‌లర్ వాసిరెడ్డి విద్యాసాగర్ హాజరయ్యారు. ఈ గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమంలో విశ్వనాథ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు సింహ కొటిల్య చౌదరి, డేలైట్ ఇండియా ఎగ్జిక్యూటివ్ మేనేజర్ కోగంటి రఘుకృష్ణ, శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి నేతి విశ్వేశ్వరరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ సాయి మంజీరా కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన ప్రహ్లాద భక్తి విజయం విశేషంగా ఆకట్టుకుంది.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



పొన్నూరు: పాఠశాలల్లో ఉత్తమ బోధనకు, క్రమశిక్షణకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంయుక్త సహకారం ఎంతో దోహదపడుతుందని మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయ భాస్కర్ అన్నారు. మండల పరిధి దొప్పలపూడి గ్రామంలోని జిల్లా ఉన్నత పరిషత్ పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సభకు పాఠశాల హెచ్‌ఎం జ్యోతిర్మయి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ పాల్గొని మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం పని చేస్తుందని, తల్లిదండ్రుల నుంచి సలహాలు సూచనలు అవసరం అన్నారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయిని ఆర్.వి జయకుమారి తయారుచేసిన డ్రెస్ కోడ్, చిన్న బొమ్మలను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



పట్నంబజారు: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగకుంటే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని లాలాపేట పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎ.వి.శివ ప్రసాద్ హెచ్చరించారు. శనివారం లాలాపేట పీఎస్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్ మాట్లాడుతూ ఎటువంటి ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలకు రౌడీషీటర్లు పాల్పడ్డారని తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంచి భవిష్యత్ కోసం చక్కటి ప్రవర్తనతో వ్యవహరించాలని సూచించారు. స్థానికుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

పట్నంబజారు: నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ కోరారు. శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద పరిశీలించి ఇన్ గేట్ వద్ద ఆటోలు, కార్లు రోడ్లపై పార్కింగ్ చేయడాన్ని గమనించారు. ఓల్డ్‌క్లబ్ రోడ్డు, 60 అడుగులరోడ్డుపై వాహనాల పార్కింగ్ వలన ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడాన్ని తగు చర్యలు తీసుకోవాలని ఈస్ట్ ట్రాఫిక్ ఎస్‌ఐ రవీంద్రబాబుకు సూచించారు. అదేవిధంగా ఆర్‌కేటీ, హిమని సెంటర్ పరిధిలో రోడ్లపై అడ్డదిడ్డంగా చిరువ్యాపారులు, ఆటోలు పార్కింగ్ చేసి ఉండటాన్ని గమనించి తోపుడు బండ్లను తొలగించాలని ఎస్‌ఐ మదన్‌మోహన్‌కు సూచించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న రోడ్లపై సామగ్రిని పక్కకు పెట్టాలని చెప్పారు. అనంతరం శంకర్‌విలాస్ ఫ్లై ఓవర్ వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా డైవర్షన్ తీసుకోవాలని ఒన్‌వే ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని ఎస్‌ఐ సాంబశివరావు నాయక్‌కు బాధ్యతలు అప్పగించారు. పట్టాభిపురం స్వామి థియేటర్ వద్ద డ్రైనేజీ, అండర్‌గ్రౌండ్ వాటర్ పైపులైను మరమ్మతుల కారణంగా ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఐ శ్రీహరిని కోరారు. చుట్టుగుంట ప్రాంతంలో డివైడర్ ఏర్పాటుతోపాటు, వ్యాపారులు అక్రమంగా షాపుల వద్ద వాహనాలు పార్కింగ్ చేయడాన్ని గమనించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది నిబద్ధతో వ్యవహరించాలని తెలిపారు.

సమస్యలు కో లొకేటెడ్ !

- ప్రత్తిపాడు కో లొకేటెడ్ ఆస్పత్రిలో ఒక్కరే వైద్యుడు
- రెండో డాక్టర్ ఉన్నా ఏడాదిన్నరగా డెప్యూటేషన్‌పైనే..
- ఉన్న ఒక్కరికీ బోలెడు విధులు..
- ప్రజలకు, సిబ్బందికి తప్పని తిప్పలు
- చోద్యం చూస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు



సంచార చికిత్స ప్రోగ్రాంలో వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్

ప్రత్తిపాడు: అది ప్రత్తిపాడు కో–లొకేటెడ్ పీహెచ్‌సీ. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన ఈ వైద్యశాలను బాలారిష్టాలు వీడటం లేదు. ఆది నుంచి అన్నీ సమస్యలే.. రెగ్యులర్ డాక్టర్లు అందుబాటులో లేక, డెప్యూటేషన్‌పై వచ్చిన డాక్టర్ నెలలో ఇరవై రోజుల పైన సంచార చికిత్స ప్రోగ్రాం విధుల్లోనే ఉండటంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి.

ప్రస్తుతం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోనే..

ప్రత్తిపాడు కో లొకేటెడ్ పీహెచ్‌సీకి రెగ్యులర్ డాక్టర్లుగా ఇద్దరు వైద్యాధికారులను నియమించారు. అందులో ఒకరైన డాక్టర్ దివ్య మేఘన ప్రత్తిపాడు కో లొకేటెడ్ నుంచి డెప్యూటేషన్‌పై పలు యూపీహెచ్‌సీల్లో చేసి, సుమారు నెల రోజుల కిందట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి వెళ్లారు. ఆమె స్థానంలో గుంటూరు నుంచి డాక్టర్ దుర్గాప్రసాద్‌ను ఈ ఏడాది మార్చిలో ఇక్కడికి డెప్యూటేషన్‌పై పంపారు. కాగా మొన్నటివరకు ఇక్కడ విధుల్లో మరో డాక్టర్ స్రవంతి కూడా పీజీకి వెళ్లడం, ఉన్న సమయంలోనూ అధికంగా సెలవులకే పరిమితం కావడంతో భారమంతా ఉన్న ఒక్క వైద్యాధికారిపైనే పడుతూ వస్తుంది.

తీవ్ర పనిభారం

దీంతో డెప్యూటేషన్‌పై ఉన్న ఒక్క డాక్టర్ ఎఫ్‌డీపీ డ్యూటీలు, ఫీల్డ్ విజిట్‌లు, సబ్ సెంటర్ల తనిఖీలు, ఎన్‌సీడీసీడీ సర్వే, పీఎంజేఏవై, ఈకేవైసీ, ఏఎంసీ రిజిస్ట్రేషన్, చైల్డ్ రిజిస్ట్రేషన్, ఆర్‌సీహెచ్ పోర్టల్, వివిన్ పోర్టల్, అన్‌మోల్ పర్యవేక్షణ, ఆన్‌లైన్ వర్క్... ఇలా అన్ని పనులూ ఒక్కరే చూసుకోవాల్సి వస్తుంది. దీంతో వారిపై పనిభారం పెరగడం, తీవ్ర ఒత్తిడిని ఎదుర్కోవడం జరుగుతుంది.

ఎక్కడ కూర్చోవాలో తెలియని దుస్థితి..

జిల్లా వైద్యాధికారులు కో లొకేటెడ్ పేరుతో పీహెచ్‌సీని అందులో స్టాఫ్ స్ట్రక్చర్‌ని, ఏర్పాటు చేసి గొట్టిపాడు పీహెచ్‌సీ కింద ఉన్న ప్రత్తిపాడు–2, 3, తిక్కిరెడ్డిపాలెం, కోయవారిపాలెం, వంగిపురం, పాతమల్లాయపాలెం సబ్‌సెంటర్లను విభజించి కో లొకేటెడ్‌కి అనుసంధానం చేశారు. ఇంతవరకూ బాగానే ఉన్నా అసలు వైద్యాధికారులు ఎక్కడ కూర్చోవాలి? ఎక్కడ ఓపీ చూడాలి అనేది సమాధానం లేని ప్రశ్నగా మిగులుతుంది. కారణం కో లొకేటెడ్ పీహెచ్‌సీకి సొంత భవనం లేకపోవడమే. మొన్నటి వరకూ ప్రత్తిపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఓపీ, ఐపీ హాల్‌లో ఓ పక్కన కుర్చీలు వేసుకుని కో లొకేటెడ్ వైద్యులు ఉండేవారు. ఇటీవల తనిఖీలకు వచ్చిన డీసీహెచ్‌ఎస్ మీరు ఇక్కడ ఉండటానికి వీల్లేదని చెప్పడంతో సమస్య మొదలయ్యింది. గత్యంతరం లేక ఆరోగ్య ఉప కేంద్రంలో ఓ టేబుల్, కుర్చీ వేసుకుని కూర్చోవాల్సి వస్తుంది.

డెప్యూటేషన్‌పై వెళ్లినా డీడీఓగా ఆమెనే..

ఎప్పుడో ఏడాదిన్నర కిందట కో లొకేటెడ్‌లో ఉన్న డాక్టర్ దివ్య మేఘనను డెప్యూటేషన్‌పై ఇతర యూపీహెచ్‌సీలకు పంపారు. కానీ డీడీఓ బాధ్యతలు మాత్రం ఇక్కడ ఉన్న వారికి అప్పగించలేదు. దీంతో ఇక్కడ ఉన్న డాక్టర్లు నెల నెలా సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వడం, అక్కడ ఉన్నవారు జీతాలు, ఇతరత్రా బిల్లులపై సంతకాలు చేయడం జరుగుతుంది. ఇదే అదనుగా కొందరు సిబ్బంది ఇక్కడి వైద్యాధికారులు చెప్పిన మాట వినే పరిస్థితి కూడా కనిపించడం లేదు. సబ్ సెంటర్లు ఎప్పుడు, తెరుస్తారో, ఎప్పుడు మూసివేస్తారో తెలియని దుస్థితి నెలకొంది.

సేవల్లో ఇబ్బందులు తలెత్తనివ్వం

ప్రజలకు సేవల్లో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తనివ్వడం లేదు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలను ఎప్పటికప్పుడు కోఆర్డినేట్ చేసుకుంటూ అన్ని కార్యక్రమాలను పక్కాగా నిర్వహిస్తున్నాం. నెలలో దాదాపుగా ఇరవై రోజులపైనే సంచార చికిత్స ప్రోగ్రామ్ క్యాంప్‌లు ఉంటాయి. లేని రోజుల్లో సబ్ సెంటర్లు విజిట్ చేస్తున్నాం.

– దుర్గాప్రసాద్, వైద్యాధికారి, ప్రత్తిపాడు కోలొకేటెడ్ పీహెచ్‌సీ

విద్య వ్యక్తిత్వ వికాసానికి పునాది



చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రొఫెసర్ వైఆర్ హరగోపాల్‌రెడ్డి, ఇతర అతిథులు

- ఏఎన్‌యూ మాజీ వీసీ ప్రొఫెసర్ వై.ఆర్.హరగోపాల్ రెడ్డి
- చలపతిలో ఘనంగా 6వ స్నాతకోత్సవం

ప్రత్తిపాడు: విద్య వ్యక్తిత్వ వికాసానికి పునాది అని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.ఆర్.హరగోపాల్ రెడ్డి అన్నారు. గుంటూరు రూరల్ మండలం లాంలోని చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్సెస్ కళాశాలలో శనివారం బీఫార్మసీ 2021–25 బ్యాచ్, ఫార్మసీ–డి 2019–2025 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ వై.ఆర్. హరగోపాల్ రెడ్డి, గుంటూరు శ్రావణి హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు డాక్టర్ పోసాని శ్రీనివాసరావు, కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత సీడీసీ డీన్ ప్రొఫెసర్ పి.రామిరెడ్డిలు హాజరయ్యారు. ప్రొఫెసర్ హరగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యలేని మనిషి పరిపూర్ణ వ్యక్తిగా అభివృద్ధి చెందలేడన్నారు. విద్య లేకపోతే మనిషి ఆలోచనాశక్తి, నైపుణ్యాలు మరియు సామాజిక బాధ్యతల పరంగా లోపభూయిష్టంగా మారతాడని చెప్పారు. చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, సెక్రెటరీ వై.సుజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు కళాశాల పురోగతి నివేదికను వివరించారు. 2024–25 విద్యా సంవత్సరంలో బి ఫార్మసీ విభాగం నుండి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ఎ.ఉమామహేశ్వరికి, ఫార్మ్‌డి విభాగం నుంచి జి.వెంకట వాగ్దేవిలకు గోల్డ్ మెడల్స్‌ను అందించారు. బీఫార్మసీ విభాగం నుంచి డి.వేళాంగిణి రాణి, ఫార్మాడీ విభాగం నుంచి పి.స్ఫూర్తిశ్రీలకు ఉత్తమ రీసెర్చ్ అవార్డు, బీ ఫార్మసీ విభాగం నుంచి ఎ.వెంకట భువనేశ్వర్, ఫార్మాడీ విభాగం నుంచి ఎం.గాయత్రీలకు ఇన్నోవేషన్ అవార్డులను అందజేశారు.

ప్రధాన ఆహారంగా 'సిరి' ధాన్యాలు

డాక్టర్ సరళ ఖాదర్



మాట్లాడుతున్న రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, వేదికపై డాక్టర్ సరళ ఖాదర్

ప్రత్తిపాడు: ప్రధాన ఆహారంగా ప్రజలు సిరిధాన్యాలను తీసుకోవాలని డాక్టర్ సరళ ఖాదర్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు రైతు నేస్తం ఫౌండేషన్‌లో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు సిరిధాన్యాలతో జీవన సిరిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అందులో భాగంగా తొలి రోజు స్థానిక కర్షక్ సేవా కేంద్రంలో జరిగిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిరుధాన్యాల నిపుణురాలు డాక్టర్ సరళ ఖాదర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి, మారిన మన ఆహారపు అలవాట్లు వలన సమాజంలోని ఎక్కువ మంది ప్రజలు ఏదో ఒక అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారన్నారు. శారీరక శ్రమ దూరమవుతుండటం, ఆహారంలో చిరుధాన్యాలు లేకపోవడంతో ఇరవై శాతమం మంది షుగర్‌తో, నలభై శాతం మంది ప్రజలు ఊబకాయంతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు తెలియజేస్తున్నాయన్నారు. అందుచేత అనారోగ్య సమస్యలకు పరిష్కారంగా సిరిధాన్యాలను ఆహారంగా తీసుకుంటూ, శారీరక శ్రమను అలవాటు చేసుకోవాలన్నారు. జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, వరిగలు, ఆరికలు, సామలు, ఊదలు, అండుకొర్రలు.. చిరుధాన్యాలేనని చెప్పారు. వీటికి రోగాలను నయం చేసే శక్తి ఉంటుందని ఆమె తెలిపారు. రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రోజూ వ్యాయామం చేయడం ద్వారా అనారోగ్యాలను దూరం చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

పెదనందిపాడులో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

- రేపు కలెక్టరేట్ వద్ద జరిగే నిరసనను జయప్రదం చేయండి
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్

ప్రత్తిపాడు: పెదనందిపాడులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14న గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. పెదనందిపాడు మండలంలో అత్యధికంగా పొగాకు సాగు చేసిన అబ్బినేనిగుంటపాలెంలో శనివారం రైతు సంఘ నాయకుడు అజయ్‌కుమార్, స్థానిక రైతు సంఘ నాయకులతో కలిసి పర్యటించారు. పొగాకు సాగు చేసిన రైతులతో మాట్లాడారు. పొగాకు గ్రేడింగ్‌కు, చెక్కులు తొక్కడానికి క్వింటాకు రూ. 2 వేలు ఖర్చవుతుందని, గుంటూరు వరకు పొగాకును తీసుకెళ్లేందుకు రవాణా ఖర్చులు కూడా రూ.వేలల్లో అవుతున్నాయన్నాని రైతులు వివరించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో పొగాకు ఉత్పత్తుల ద్వారా ఏడాదికి రూ.73 వేల కోట్ల ఆదాయం పన్నుల రూపంలో ప్రభుత్వానికి వస్తుందని, అందులో కనీసం రూ.వెయ్యి కోట్లు కేటాయించి పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేసి రైతుల వద్దనున్న పొగాకును కొనాలని కోరారు. రూ. 12 వేలకు కొంటేనే రైతులకు గిట్టుబాటు అవుతుందని చెప్పారు. పెదనందిపాడులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తానని గతంలో మార్క్‌ఫెడ్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చెప్పినప్పటికీ నేటి వరకు ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో పొగాకు రైతులందరూ పాల్గొనాలని కోరారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, నాయకులు నల్లమోతు రాజేంద్ర, పసుపులేటి శేషగిరిరావు, మదమంచి అప్పారావు, మదమంచి నాగేశ్వరరావు, మాకినేని వెంకటేశ్వర్లు, జాగర్లమూడి కోటేశ్వరరావు, వేజెండ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తియ్యగూర కృష్ణారెడ్డి నియామకంపై హర్షం



తియ్యగూర కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నేతలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా ప్రత్తిపాడు నియోజకవర్గం వట్టి చెరుకూరు మండలం గారపాడుకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు తియ్యగూర వెంకట కృష్ణారెడ్డి నియామకంపై బీజేపీ సీనియర్ నాయకులు పాలపాటి రవికుమార్, ఈదర శ్రీనివాసరెడ్డి, వెలగలేటి గంగాధర్, కొక్కెర శ్రీనివాస్, ఈమని మాధవరెడ్డి, తాడువాయి రామకృష్ణ, ప్రతాప్ ప్రసాద్, జితేంద్ర గుప్త, బొలగాని సాంబయ్య, రాము, యువమోర్చా నాయకులు సాయి రాధాకృష్ణ, మధు తదితర బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బీజేపీ పబ్లిసిటీ అండ్ లిటరేచర్ సెల్ రాష్ట్ర కన్వీనర్ పాలపాటి రవికుమార్ మాట్లాడుతూ నిబద్ధతగా పార్టీ కోసం గత 30 సంవత్సరాలుగా కృషి చేస్తున్న కృష్ణారెడ్డికి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బాధ్యత రావటం ఆనందదాయకమన్నారు. ఈసందర్భంగా వారిని గుంటూరు బ్రాడీపేటలోని తమ కార్యాలయంలో ఘనంగా సన్మానించడం జరిగిందన్నారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ తనకు బాధ్యత రావటానికి కారణమైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి, తనకు సహకరించిన సహచర నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ అయ్యంగార్ మెమోరియల్ పురస్కారం ప్రదానం



మురళికి పురస్కారం ప్రదానం చేస్తున్న వక్తలు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో గాన కళానిధి వింజమూరి వరదరాజ అయ్యంగార్ జయంతి సంగీత వేడుకలు నిర్వహించారు. వింజమూరి సంధ్య (చెన్నై), త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్, కార్యదర్శి వల్లూరి కష్ణకిషోర్, ఆలయ పాలకమండలి ఉపాధ్యక్షులు లంకా విజయవాబు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సభకు సన్మండలి ఉపాధ్యక్షురాలు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి అధ్యక్షత వహించారు. ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసులు విద్వాన్ ఏఎస్ మురళి(చెన్నై)కి డాక్టర్ వింజమూరి వరదరాజ అయ్యంగార్ మెమోరియల్ పురస్కారం అందించి సత్కరించారు. సభానంతరం ఏఎస్ మురళి శాస్త్రీయ సంగీత కచేరి అలరించింది. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎం.వై.శేషురాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితా దేవి, కార్యదర్శి ఏ.వీ.మంగాదేవి, కోశాధికారి విజయలక్ష్మి పాల్గొనగా, కళాకారులను అతిథులను సత్కరించారు.

విద్యతోనే సమాజంలో ఉన్నతి

పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో డాక్టర్ జయకిషన్



మాట్లాడుతున్న డాక్టర్ కొల్లి జయకిషన్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యతోనే సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని కిమ్స్ శిఖర హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కొల్లి జయకిషన్ అన్నారు. శనివారం పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాలుగో వార్షికోత్సవాన్ని రెవెన్యూ కల్యాణ మండపంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. డాక్టర్ జయకిషన్ మాట్లాడుతూ సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరు విద్య నేర్చుకోవడం ద్వారా ఉన్నత స్థితికి ఎదగాలని, పద్మశాలీలు ముందు వరసలో నిలబడాలని సూచించారు. ఆదాయ పన్ను శాఖ అదనపు కమిషనర్ వి.కోటేశ్వరి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నెలకొన్న పోటీని తట్టుకునే విధంగా విద్యనభ్యసించాలని సూచించారు. ఏవీఆర్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ అందే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పద్మశాలీ సంక్షేమం కోసం అసోసియేషన్ కృషి చేయాలని సూచించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపతి వెంకటరావు, కోశాధికారి టి.చంద్రశేఖర్ నివేదికలను ప్రవేశపెట్టి చర్చ అనంతరం ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈసందర్భంగా ఇటీవల ఎంబీబీఎస్ సీటు పొందిన ఓ విద్యార్థికి ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా రూ.30 వేలు సహాయాన్ని అందించారు. అదే విధంగా జాతీయ వెయిట్ లిఫ్టింగ్‌లో ద్వితీయ స్థానం పొందిన బిట్రా రోచస్మతికి రూ.30 వేలు, 13 ఏళ్ల విభాగంలో బాలుర షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్ సాధించిన పి.నోమన్‌కు రూ.10 వేలతో పాటు పలువురు విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు నిర్ణయించారు. దీంతో పాటు జానపద గేయాల ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన సోమిశెట్టి సరళ, యోగా ద్వారా గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు సాధించిన సీహెచ్ వసంత లక్ష్మిని సత్కరించారు. గతేడాది కాలంగా ఉద్యోగ విరమణ, ఉద్యోగోన్నతి పొందిన పద్మశాలీ ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో కిమ్స్ చక్ర కేన్సర్ కేర్ హాస్పిటల్ ఈడీ డాక్టర్ టి.మహతి, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘ రాష్ట్ర కన్వీనర్ జీవీ నాగేశ్వరరావు, కోశాధికారి టి.చంద్రశేఖర్, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ జీవీఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సైబర్ మోసానికి గురైతే తక్షణమే ఫిర్యాదు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సైబర్ మోసానికి గురైన తక్షణమే ఫిర్యాదు చేయడం ద్వారా భద్రతాపరమైన చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సీనియర్ మేనేజర్ ఏఎస్వీ బాలకృష్ణ పేర్కొన్నారు. జేకేసీ కళాశాలలో శనివారం ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో మొబైల్, సైబర్ మోసాలపై అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రీసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న బాలకృష్ణ మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్‌లో గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని, మోసం జరిగిన మొదటి గంట వ్యవధిలో 1930కు ఫోన్ చేయడంతో పాటు సైబర్‌క్రైమ్.కామ్‌కు ఫిర్యాదు చేస్తే ఫలితం ఉంటుందని తెలిపారు. ఎటువంటి మోసమైనా నమ్మకంపైనే ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఈసందర్భంగా ప్రస్తుత సమాజంలో స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ ద్వారా జరుగుతున్న మోసాలు, బ్యాంకింగ్ రంగంలో జరుగుతున్న నేరాలు, ఏ విధంగా జరుగుతాన్నాయనే విషయాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడారు. సదస్సులో కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సాంబశివరావు, ఐక్యూఏసీ సమన్వయకర్త టీబీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినియల్ ప్రమాణ స్వీకారం

ప్రత్తిపాడు: గుంటూరు నగరం జేకేసీ కళాశాల రోడ్డులోని శ్రీ మౌర్య కన్వెన్షన్‌లో నేడు రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినియల్ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా డాక్టర్ ఆతుకూరి వీర, కార్యదర్శిగా చెన్న సంతోష్ కుమార్, ట్రెజరర్‌గా కోటా మురళీకృష్ణ నియమితులైనట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా జిల్లా గవర్నర్ 2026–27 ఉదయ్ పిలాని హాజరవుతున్నట్లు తెలిపారు.

19న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పొన్నూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 19వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భవనం పద్మలీల అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించనున్నట్లు తెలిపారు. మధ్యాన్నం 3 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం


పెదకాకాని: ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల గాంధీబొమ్మ సెంటర్‌లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 1 గంట వరకూ శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ శిబిరంలో నాడీ పరీక్ష, కీళ్ళ నొప్పులు, డిస్క్ ప్రొబ్లమ్, సయాటికా, పక్షవాతం, మోకాళ్ళ అరుగుదల, ఆస్మా, ఎలర్జీలు, అధిక బరువు, చర్మవ్యాధులు, సోరియాసిస్, పైల్స్, వెన్నుపూస వంటి దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



ప్రత్తిపాడు: అనుమానాస్పదస్థితిలో గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు రూరల్ మండలం పెద పలకలూరు ఎల్‌ఐసీ కాలనీ శివారు పొలాల్లో ఉన్న కాలువ గట్టుపై మహిళ మృతదేహం పడి ఉండటాన్ని శనివారం స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న నల్లపాడు పోలీసులు ఆరా తీస్తున్నారు. వయస్సు యాభై సంవత్సరాలు ఉంటుందని భావిస్తున్నారు. క్లూస్ టీంను రంగంలోకి దింపి ఆధారాలను సేకరిస్తున్నారు. ఘటనా స్థలాన్ని గుంటూరు సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ భానూదయ పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వంశీధర్ తెలిపారు.

అక్రమాలకు పాల్పడుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలు



లక్ష్మీపురం: నగరంలో ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా భాష్యం విద్యాసంస్థలు సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహిస్తున్నారని ప్రశ్నించిన ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి నాయకులపై భాష్యం యాజమాన్యం, దౌర్జన్యానికి దిగడం సరి కాదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, నగర కార్యదర్శి యశ్వంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు నగరంలో భాష్యం విద్యాసంస్థలు పాఠశాలలు, కళాశాలలు సెలవు దినాలలో కూడా నిబంధనలకు వ్యతిరేకంగా తరగతులు నిర్వహిస్తుండటంతో శనివారం ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘ నాయకులు ఆందోళనకు దిగారు. కళాశాల ముందు కొద్ది సేపు నిరసన వ్యక్తం చేశారు. కళాశాల యాజమాన్యాన్ని విద్యార్థి సంఘ నాయకులు నిలదీయగా పోలీసులతో కలిసి యాజమాన్యం నిరసనకారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొద్దిసేపు విద్యాసంస్థల ఎదుట నినాదాలతో హోరెత్తింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భాష్యం విద్యా సంస్థల యాజమాన్యం ఇలా విద్యార్థులను మానసికంగా ఇబ్బంది పెట్టే పనులు చేస్తున్నా ప్రభుత్వం ఏ విధంగా కూడా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ప్రతి ఆదివారం, రెండో శనివారాలు పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ఇవ్వాలని, లేకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి షంషీర్, నగర ఉపాధ్యక్షులు సుభాని, రాకేష్ కమిటీ సభ్యులు నాగ ప్రవీణ్, ఆరిఫ్, ఇర్ఫాన్, గోపి, సుజిత్, మహమ్మద్ నాసిర్, గిరీష్, అన్వర్, భాను, అభి పాల్గొన్నారు.